క్లుప్తంగా

దుర్గమ్మ సన్నిధిలో యువ శతావధానం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): వసంత నవరాత్రోత్సవాలను పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో శుక్రవారం యువ శతావధానం జరిగింది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై శుక్రవారం ఉప్పలదడియం భరత్‌శర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన అవధానంలో తొలి అచ్చ తెలుగు అవధాని డాక్టర్ పాలవర్తి శ్యామలానందప్రసాద్, డాక్టర్ కప్పగంతు రామకృష్ణ, మెట్ట వెంకటేశ్వరరావు, డాక్టర్ కానుకొల్లు బాలకృష్ణ, పింగళి వెంకటకృష్ణారావు, కేఎస్ రామారావు, పీ భానుమతి, డాక్టర్ దండిభోట్ల దత్తాత్రేయ శర్మ పాల్గొన్నారు. శతావధానంలో పాల్గొన్న ప్రముఖులకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం ఆలయ ఈఓ రామారావు వారికి అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.

పేదలకు అన్నదానం



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): క్లే లలిత చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సింగ్‌నగర్ రైతుబజార్ వద్ద శుక్రవారం అన్నదానం చేశారు. ఆ ట్రస్ట్ డైరెక్టర్లు క్లే సీతామహాలక్ష్మి, జయదుర్గ, మేఘవాణి పాల్గొని ముందుగా లలిత విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విలేఖర్లతో మాట్లాడుతూ నిరుపేద ప్రజలను ఆదుకోవడంలోనే అసలైన సంతృప్తి ఉంటుందని తెలిపారు. ఆకలితో, ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాల్సిన బాధ్యత సమాజంలో ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. తమ ట్రస్ట్ ఆధ్వర్యంలో గత 29 నెలల నుంచి ప్రతి నెలా నిరుపేదలకు ఉపయోగపడేలా కూలింగ్ వాటర్ మిషన్ల పంపిణీ, ఏసీ బాక్సులు, పారిశుద్ధ్య కార్మికులకు నూతన వస్త్రాలు, నెలవారీ సరుకుల పంపిణీ, అన్నదానం వంటి అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని వివరించారు. ట్రస్ట్ అధ్యక్షుడు క్లే నాగేశ్వరరావు, మాజీ కార్పొరేటర్ చందనసురేష్, ముప్పూరి హరీష్, ఎమ్.జశ్విన్, జి.ధ్రువన్ పాల్గొన్నారు.

మహాలక్ష్మి స్వరూపం సీతాదేవి



విజయవాడ కల్చరల్: మహాలక్ష్మి స్వరూపం సీతాదేవి అని ఆధ్యాత్మికవేత్త మండలీక కృష్ణకుమార్ అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నూతన తెలుగు సంవత్సరం, శ్రీరామనవమి సందర్భంగా టీటీడీ కల్యాణ మండపంలో శ్రీమద్రామాయణం సప్తాహం శుక్రవారం నిర్వహించారు. సీతా చరితం అంశంగా శుక్రవారం కృష్ణకుమార్ ప్రసంగించారు. హిందూ సమాజంలో స్త్రీ ప్రవర్తనకు, ఆలోచనకు సీతా చరిత్ర మార్గదర్శకంగా నిలిచిందని చెప్పారు. మాతృత్వానికి ప్రతి రూపంగా సీతను సీతమ్మ తల్లి అని పిలుస్తారని పేర్కొన్నారు. సీతా జననం, శ్రీ రామునితో వివాహం, అరణ్యవాసం, సీతాపహరణ, లంకా దహనం, సీత అగ్ని ప్రవేశం అంశాలను ఆయన శ్రావ్యంగా వినిపించారు. శనివారం సాయంత్రం ఆరు గంటలకు మరుధూరి నరసింహాచార్యులు సేవా ధర్మం అంశంగా ప్రసంగిస్తారని ధర్మ ప్రచార పరిషత్ ప్రోగామ్ అసిస్టెంట్ సీవీకే ప్రసాద్ తెలిపారు.

అమ్మవారికి గాజులతో అర్చన



మధురానగర్(విజయవాడసెంట్రల్): వసంత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ముత్యాలంపాడు పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామివారి దేవాలయంలో శుక్రవారం అమ్మవారికి గాజులతో అర్చన నిర్వహించారు. విశేష సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్షుడు డీవీఎస్ రాజు పర్యవేక్షించారు.

సన్నబియ్యం పంపిణీ చేయాలి

కంకిపాడు: రేషన్ షాపుల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేసేందుకు కేంద్రం చర్యలు తీసుకోవాలని నూర్‌బాషా ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ చిన్నా, రాష్ట్ర గౌరవ అధ్యక్షురాలు షేక్ మాబిని డిమాండ్ చేశారు. ఈడుపుగల్లులోని సంఘం కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. నాణ్యమైన సన్నబియ్యం రూ. 29 కే సరఫరా చేస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటన జారీచేసి మూడు నెలలు గడిచిందన్నారు. అయితే పంపిణీ ప్రక్రియ ప్రధాన ప్రాంతాలకే పరిమితం అయ్యిందన్నారు. రేషన్ షాపుల ద్వారా ప్రతి ఒక్కరికీ సన్నబియ్యం చేరేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

పశ్చిమం.. ఒక మినీ భారత్

పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్



ప్రజలకు ప్రభుత్వ పథకాల కరపత్రాలను అందజేస్తున్న ఆసిఫ్, మేయర్ భాగ్యలక్ష్మి, పుణ్యశీల

పూర్ణానందంపేట(విజయవాడ పశ్చిమ): పశ్చిమ నియోజకవర్గం ఒక మినీ భారత్ అని.. ఇక్కడ నివాసం ఉండే ప్రజలు అందరూ కుల, మతాలకు అతీతంగా సోదరభావంతో ఉంటారని పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్ పేర్కొన్నారు. గడప గడపకు వైఎస్సార్ సీపీ కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన 34వ డివిజన్ ఖుద్దుస్‌నగర్‌లో నిర్వహించారు. నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, రాష్ట్ర ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, స్థానిక కార్పొరేటర్ బండి నాగేంద్ర పుణ్యశీలతో కలిసి పర్యటించారు. ప్రతీ గడపకు వెళ్లి స్థానికులను ఆప్యాయంగా పలకరించి వారి సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రంలో చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆసిఫ్ మాట్లాడుతూ కోట్లకు పడగలెత్తిన వ్యక్తులను పశ్చిమ నియోజకవర్గంలో దించి గెలవాలన్న టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీలకు నియోజకవర్గ ప్రజలు వచ్చే నెల 13న జరగనున్న ఎన్నికల్లో తమ ఓటుతో బుద్ధి చెబుతారని తెలిపారు. వైఎస్సార్ సీపీ వరుసగా రెండుసార్లు విజయ ఢంకా మోగించిన స్థానంలో మరోసారి విజయం సాధించి హ్యాట్రిక్‌ను సొంతం చేసుకోవడం ఖాయమన్నారు. నియోజకవర్గంలో ఎన్ని కులాలు, మతాలు ఉన్న ప్రజలందరూ ఐక్యంగా అన్నదమ్ములుగా, అక్కచెల్లెమ్మలుగా ఉంటారన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీలు కులాలు, మతాలను విడగొట్టి చేసే రాజకీయాలు పశ్చిమ నియోజకవర్గంలో చెల్లవని పేర్కొన్నారు. కొండలు, గుట్టలు, చుట్టూ రైల్వే ట్రాక్‌లు ఉన్న నియోజకవర్గంలో ఎక్కడ ఏమి ఉందో తెలియని ఢిల్లీ బాబును ఇక్కడ డంప్ చేసి గెలవాలనుకోవడం ప్రతిపక్ష పార్టీల అవివేకమన్నారు. స్థానిక కార్పొరేటర్ బండి నాగేంద్ర పుణ్యశీల మాట్లాడుతూ సీఎం జగనన్న లక్ష్యం 175కు 175 సీట్లు సాధించేందుకు తామంత కలిసి కట్టుగా కృషి చేస్తామన్నారు.

పశ్చిమ నియోజకవర్గ సీటును అత్యధిక మెజార్టీతో గెలిచి జగనన్నకు బహుమతిగా అందిస్తామన్నారు. శనివారం జరగనున్న జగనన్న బస్సు యాత్రలో నియోజకవర్గ ప్రజలు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు యలకల చలపతిరావు, ఇర్ఫాన్, రాజేష్, చైతన్యరెడ్డి, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ జమల పూర్ణమ్మ, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ గౌస్‌మోహిద్దీన్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు పాలిమెట్ల శరత్‌బాబు, నగర అధ్యక్షుడు బూదాల శ్రీను, స్థానిక నాయకులు మాబు, సుధాకర్, మండవ శివ, ఎలేజర్, లక్ష్మి, వీర్రాజు, శివకుమారి తదితరులు పాల్గొన్నారు.

మహేష్ రాజీనామాతో నగరంలో జనసేన ఖాళీ

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పోతిన మహేష్ రాజీనామాతో జనసేన మొత్తం నగరంలో ఖాళీ అయిందని ఆ పార్టీకి రాజీనామా చేసిన పలువురు డివిజన్ అధ్యక్షులు పేర్కొన్నారు. పోతిన మహేష్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడారు. విజయవాడ పశ్చిమ నుంచే కాకుండా సెంట్రల్, తూర్పు నియోజకవర్గాల నుంచి చాలామంది నాయకులు రాజీనామాలు చేశారన్నారు. పశ్చిమంలో ఇప్పటికే దాదాపు 12 డివిజన్ల అధ్యక్షులు, పలువురు డివిజన్ సమన్వయకర్తలు పలు అనుబంధ విభాగాల నాయకులు జనసేనకు రాజీనామాలు చేశారని తెలిపారు. పశ్చిమ నియోజకవర్గంలో ఇటీవల జనసేన పార్టీ మీటింగ్ జరిగిందని, అది ఆ పార్టీ మీటింగ్ కాదని, కూటమి సమావేశమని చెప్పారు. ఆ సమావేశానికి కూడా ఆపసోపాలు పడితే విజయవాడ నగరం మొత్తం మీద నుంచి 30 మంది నాయకులు కూడా హాజరు కాలేదన్నారు. మిగిలిన వారందరినీ డబ్బు, బిర్యానీలతో తరలించారని చెప్పారు. మహేష్ నిజాయితీకి మెచ్చి జనసేన నాయకులు పలువురు మాట తప్పని, మడమ తిప్పని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరడం జరిగిందన్నారు. 11 సంవత్సరాల నుంచి రాజీలేకుండా పోరాడిన పశ్చిమ నియోజకవర్గంలోని జనసేన నాయకుడికి సీటు లేకుండా అన్యాయం చేస్తే ఏమి చేయాలని ప్రశ్నించారు. పవన్‌కళ్యాణ్ నాయకత్వంలో పోతిన మహేష్‌కు అన్యాయం జరిగిందని రాష్ట్రం మొత్తం ప్రజలందరూ ముక్తకంఠంతో చెబుతున్నారని అన్నారు. రానున్న రోజుల్లో విజయవాడ పశ్చిమ నియోజకవర్గంతో పాటు తూర్పు, సెంట్రల్‌ల్లో సైతం వైఎస్సార్ సీపీ విజయం సాధించే విధంగా తామందరం పని చేస్తామని పేర్కొన్నారు.

సమావేశంలో నాయకులు కొరగంజి వెంకటరమణ, శిగినంశెట్టి రాముగుప్తా, సామి గోవిందు, రమేష్, షేక్ అమీర్‌భాష, ఎం.హనుమాన్, షేక్ మోబినా, పాట్నూరు శ్రీనివాసరావు, తమ్మిన రఘు, పిల్లా రవి, పిల్లా శంకర్, బొట్టా సాయి, బందిచొడే శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అందరూ సోదరభావంతో మెలగాలి

ఆటోనగర్(విజయవాడతూర్పు): అందరూ సోదరభావంతో మెలగాలని పలువురు ముస్లింలు తెలిపారు. ఆటోనగర్ నాలుగో రోడ్డులో పాత టైర్ల యజమానులు ఈద్ మిలాప్ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లింలతో పాటు హిందువులు, క్రైస్తవులు ఒకరినొకరు ఆలింగనం చేసుకున్నారు. రంజాన్ పర్వదినం మరుసటి రోజున ఈద్ మిలాప్ చేయడం ఆనవాయితీ అని తెలిపారు. కార్యక్రమంలో కలాం బ్యాటరీ వర్క్స్ అధినేత అబ్దుల్ కలాం, ఏటీపీ అధ్యక్షుడు రాజనాల వెంకటరమణారావు, మాజీ ఐలా చైర్మన్ ఎస్.దుర్గాప్రసాద్, బాజీషరీఫ్, ఎండీ నూర్, డిస్పోజబుల్ అధ్యక్షుడు గౌస్‌ఖాన్, ఆర్గనైజర్స్ ఎండీ హరీఫ్, రంహతుల్లా, షరీఫ్, ఎండీ రిజ్వాన్, ఎస్‌కే బాబు, ఖాదిర్ తదితరులు పాల్గొన్నారు.

200 మందికి వైద్య పరీక్షలు



పెనమలూరు: పెదపులిపాక గ్రామంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 200 మందికి ఉచిత వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. లయన్స్‌క్లబ్ తాడిగడప సాయినగర్ ఆధ్వర్యలో శుక్రవారం ఏర్పాటు చేసి ఉచిత మెగా వైద్య శిబిరాన్ని డిస్ట్రిక్టు గవర్నర్ లయన్ జేఎస్.గుప్తా ప్రారంభించారు. గ్రామ సర్పంచి గుంటూరు శ్రీనివాసరావు మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ద్వారా గ్రామంలో మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేయటం వలన గ్రామంలో పేదలు ఉచిత వైద్య పరీక్షలు చేయించుకోవటానికి అవకాశం ఏర్పడిందన్నారు. లయన్స్ క్లబ్ ఇటువంటి వైద్య శిబిరాలు ఏర్పాటు చేయటం వలన గ్రామీణ ప్రాంత ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. వైద్య శిబిరంలో బీపీ, షుగర్, ఈసీజీ, ఎకో తదితర వ్యాధులకు వైద్య పరీక్షలు చేసి మందులు ఉచితంగా అందజేశారు. క్లబ్ అధ్యక్షుడు కె.చక్రధరరావు, కార్యదర్శి యలమంచిలి సురేష్, సభ్యులు కేవీఎస్.చౌదరి, ఎం.సాంబశివరావు, ఆర్.సుబ్బారావు, సభ్యులు పాల్గొన్నారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల తనిఖీ



పోరంకిలో పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేస్తున్న సీఐ రామారావు

పెనమలూరు: పెనమలూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను శుక్రవారం పెనమలూరు సీఐ టీవీవీ.రామారావు, ఎస్ఐ శేషుకుమార్, సిబ్బంది తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ రామారావు మాట్లాడుతూ త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరగడానికి పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టామన్నారు. మండల పరిధిలో ఉన్న సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశామని అన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టి ఆయా కేంద్రాల పరిధిలో ఉన్న రౌడీషీటర్లు, సస్పెక్టు షీటర్లు, ఎన్నికల సమయంలో గొడవలు చేసే వారిని గుర్తించి బైండోవర్ కేసులు నమోదు చేస్తామన్నారు.
ఓటర్లను ఆకర్షించటానికి ఉచితంగా బహుమతులు పంచకుండా వారించటానికి ప్రత్యేక చెక్ పోస్టులు ఏర్పాటు చేస్తామన్నారు. మద్యం అక్రమంగా రవాణా చేయకుండా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఆయా రాజకీయ పార్టీల నేతలు, ప్రజలు ఎన్నికల నియమావళిని విధిగా పాటించాలని సూచించారు. చట్ట విరుద్ధంగా వ్యవహరించే ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదని పేర్కొన్నారు.

ఐఎన్‌టీఎస్ఓలో శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ



బహుమతులు అందుకున్న విద్యార్థులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): జాతీయ స్థాయిలో నిర్వహించే ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలింపియాడ్(ఐఎన్‌టీఎస్ఓ) పరీక్షల్లో విజయవాడ జోన్ శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు మెరుగైన ప్రతిభను కనబరిచి బహుమతులు సాధించారు. ఈ సందర్భంగా శుక్రవారం భవానీపురం శ్రీచైతన్య పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో జోన్ ఏజీఎం మద్దినేని మురళీకృష్ణ అభినందించి బహుమతులు అందజేశారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతోపాటు గోల్డ్ మెడల్, మెరిట్ సర్టిఫికెట్స్‌ను శ్రీనందిని సాక, ఫర్హీన్ సయ్యద్, తేజేష్‌కుమార్‌లు అందుకున్నారు. వారితోపాటు వివిధ కేటగిరిల్లో సుమారు 300 మంది విద్యార్థులు బంగారు పతకాలు, ప్రశంసా పత్రాలు అందుకున్నారు. ఈ సందర్భంగా ఏజీఎం మురళీకృష్ణ మాట్లాడుతూ తరగతి గదుల్లో చదువుతో పాటు పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని, తద్వారా విద్యార్థులు బహుమతులు సాధిస్తున్నారని చెప్పారు.
ప్రతి విద్యార్థి మొబైల్ ఫోన్, టీవీకి దూరంగా ఉంటూ విద్యార్థి దశలో కేవలం చదువుపై మాత్రమే దృష్టి సారించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ జీ సత్యచిత్ర, డీన్ రంగారావు, కోఆర్డినేటర్ చక్రధర్‌ప్రసాద్, ఆర్ఐ రామారావు, సీ బ్యాచ్ ఇన్‌చార్జ్ నాగరాజు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో చైతన్య విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ఇంటర్మీడియెట్ ఫలితాల్లో చైతన్య విద్యాసంస్థకు చెందిన విద్యార్థులు ప్రతిభ చూపారని చైతన్య విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ జనరల్ మేనేజర్ మద్దినేని మురళీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో 470 మార్కులకు గాను ఐదుగురు విద్యార్థులు 466 మార్కులు, 56 మంది విద్యార్థులకు 465 మార్కులు, 805 మంది విద్యార్థులు 480 మార్కుల పైన సాధించారని తెలిపారు. జూనియర్ ఇంటర్ బైపీసీ విభాగంలో 440 మార్కులకు గాను ఒక విద్యార్థికి 435 మార్కులు, 13 మంది విద్యార్థులకు-435 మార్కులు, 184 మంది విద్యార్థులు 430 మార్కుల పైన సాధించారని వివరించారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో 1000 మార్కులకు గాను ఐదుగురు విద్యార్థులకు 990 మార్కులకుపైగా సాధించారని, 106 మంది విద్యార్థులకు 985 మార్కుల పైగా, 388 మంది విద్యార్థులు 980 మార్కుల పైగా పొందారని వివరించారు. సీనియర్ ఇంటర్ బైపీసీ విభాగంలో 1000 మార్కులకు గాను ఇద్దరు విద్యార్థులు 989 మార్కులకు పైగా పొందారన్నారు. 17 మందికి 985 మార్కుల పైగా పొందారని, 78 మంది విద్యార్థులు 980 మార్కుల పైగా పొందారని తెలియజేశారు. విద్యార్థులు మంచి మార్కులు పొందటంలో ముఖ్యపాత్ర పోషించిన అధ్యాపకులతో పాటుగా ఉత్తమ మార్కులు పొందిన విద్యార్థులను మురళీకృష్ణ అభినందించారు.

వృద్ధుడు అదృశ్యంపై కేసు

పెనమలూరు: పోరంకి గ్రామంలో వృద్ధుడు అదృశ్యమైన ఘటనపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసుల కథనం ప్రకారం.. పోరంకి సత్యాప్రైడ్ అపార్టుమెంట్‌లో బొమ్మారెడ్డి కార్తీక్‌రెడ్డి కుటుంబ సభ్యులతో ఉంటున్నాడు. అతని తండ్రి బాలకృష్ణారెడ్డి (63) కుమారుడితోనే ఉంటాడు. అతను ఏపీ ఆయిల్ సీడ్స్‌లో మేనేజర్‌గా పని చేసి పదవీ విరమణ చేసిన తర్వాత గత మూడు సంవత్సరాలుగా కుమారుడి వద్దే ఉంటున్నాడు. కార్తీక్‌రెడ్డి వసంతనగర్‌లో కొత్తగా ఇల్లు నిర్మాణం చేస్తున్నాడు. కొత్త ఇంటికి సొమ్ము ఎక్కువగా ఖర్చు చేస్తున్నామని బాలకృష్ణారెడ్డి కుటుంబ సభ్యులతో తగాదాపడి 11వ తేదీ రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లి పోయాడు. అతని కోసం వెతికినా ఆచూకీ తెలియక పోవటంతో కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

దాడి ఘటనపై కేసు నమోదు

పెనమలూరు: అపార్టుమెంట్‌లో పిల్లల వద్ద తలెత్తిన తగాదా కారణంగా వ్యక్తి పై పలువురు దాడి చేయటంతో పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ.రామారావు తెలిపిన వివరాల ప్రకారం.. యనమలకుదురు పెట్రోల్ బంక్ వద్ద అమీర్‌టవర్స్‌లో వేముల నాగేశ్వరరావు కుటుంబ సభ్యులతో ఉంటున్నాడు. కాగా గురువారం అతను ఉంటున్న అపార్టుమెంట్ ఆవరణలో పిల్లలు ఆడుకుంటూ గొడవ పడ్డారు. అదే అపార్టుమెంట్‌లో ఉంటున్న జ్యోతి కోపంతో నాగేశ్వరరావు పిల్లలను కొట్టింది. దీంతో నాగేశ్వరరావు, అతని కుటుంబ సభ్యులకు.. జ్యోతికి వాగ్వాదం జరుతున్న సమయంలో జ్యోతికి మద్దతుగా ముగ్గురు వ్యక్తులు వచ్చి నాగేశ్వరరావుపై విచక్షణారహితంగా దాడి చేశారు. ఈ దాడిలో గాయపడిన నాగేశ్వరరావు విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్సకై చేరాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దాడి చేసిన వ్యక్తులపై కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

ఉంగుటూరు: జూదశిబిరంపై ఆత్కూరు పోలీసులు దాడి చేసి ఐదుగురు వ్యక్తులను శుక్రవారం అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తేలప్రోలు శివారు పంటపొలాల్లో పేకాట నిర్వహిస్తున్నారనే సమాచారంతో ఎస్ఐ పైడిబాబు, సిబ్బంది దాడి చేశారు. ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ. 5110 స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేశామని తెలిపారు.

పొలిటికల్ టూరిస్టులతో జాగ్రత్త



48వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మేయర్ భాగ్యలక్ష్మి, శ్వేత

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఎన్నికల సమయంలో వచ్చే పొలిటికల్ టూరిస్టులతో అప్రమత్తంగా ఉండాలని, ఓడిపోగానే వాళ్లు వెళ్లిపోతారని మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కేశినేని శ్వేత పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్(నాని), ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్‌లకు మద్దతుగా 48వ డివిజన్ కార్పొరేటర్ అత్తులూరి ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో డివిజన్‌లోని కొండ ప్రాంతాల్లో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సొరంగం రోడ్డులోని విశ్వబ్రాహ్మణ కల్యాణ మండపం నుంచి ప్రచారం ప్రారంభించగా, చిరు వ్యాపారులు, వృద్ధులు, మహిళలను ఆప్యాయంగా పలకరిస్తూ ముందుకు సాగారు. సాధుజాన్ వీధి మీదుగా సొరంగం కొండపైకి చేరుకున్న మేయర్ భాగ్యలక్ష్మి, కేశినేని శ్వేత, కార్పొరేటర్లు ఆదిలక్ష్మి, మరుపిళ్ల రాజేష్, పడిగపాటి చైతన్యరెడ్డి, యలకల చలపతిరావులు ప్రతి ఇంటికీ వెళ్లి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద, మధ్య తరగతి ప్రజల కోసం ఈ ఐదేళ్లలో చేపట్టిన సంక్షేమ పథకాల కరపత్రాలను అందించి ఆశీర్వదించాలని కోరారు. రెండు ఓట్లలో ఒకటి ఎంపీ అభ్యర్థి కేశినేని నానికి, మరొకటి ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్‌కు వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా మేయర్ భాగ్యలక్ష్మి, కేశినేని శ్వేత మాట్లాడుతూ ఎన్నికల పేరిట పొలిటికల్ టూరిస్టులు వస్తున్నారని తెలిపారు. వారికి, ప్రజా సమస్యలపై అవగాహన ఉన్న స్థానికులకు మధ్య పోటీ జరుగుతుందన్నారు. పశ్చిమను సింగపూర్ చేస్తామని చెబుతున్న ఉమ్మడి అభ్యర్థి, మాతో సమానంగా కొండలు ఎక్కగలరా అని ప్రశ్నిస్తున్నామని అన్నారు. పశ్చిమలో జరిగిన అభివృద్ధితో బహిరంగ చర్చకు మేము సిద్ధమని పేర్కొన్నారు. 48వ డివిజన్‌ను నాలుగు కోట్లతో అభివృద్ధి చేయడం జరిగిందని వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు మైలవరపు రత్నకుమారి, కోటిరెడ్డి, మహదేవు అప్పాజీరావు, గుడివాడ నరేంద్ర, అబ్దుల్ అర్షద్, 48వ డివిజన్ ఇన్‌చార్జి అత్తులూరి పెదబాబు, అధ్యక్షుడు పిళ్లా సూరిబాబు, ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధికార ప్రతినిధి మెహరాజ్, నాయకులు అయితా కృష్ణకిశోర్, నగర ఎస్సీ సెల్ అధ్యక్షుడు బూదాల శ్రీనివాసరావు, దిద్దుకూరి శివతో పాటు వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, సోషల్ మీడియా సభ్యులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్వేతకు పుట్టిన రోజు శుభాకాంక్షలు..

కేశినేని శ్వేత పుట్టిన రోజును పురస్కరించుకుని వైఎస్సార్ సీపీ నేతలు కేక్ కట్ చేయించారు. ప్రచార యాత్ర ప్రారంభంలో సొరంగం రోడ్డులో పెద్ద ఎత్తున చిన్నారులు శ్వేతకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే కొండప్రాంతాల్లో పర్యటన అనంతరం డివిజన్‌లో కేక్ కట్ చేయించిన పార్టీ నేతలు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు.

చంద్రబాబు దళితులకు బహిరంగ క్షమాపణ చెప్పాలి

వైఎస్సార్ సీపీ ఎస్సీ విభాగం నేత కావూరి జయకుమార్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎస్సీలను అడుగడుగునా అవహేళన చేస్తున్న ప్రతిపక్షనేత చంద్రబాబు దళితులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని వైఎస్సార్ సీపీ ఎస్సీ విభాగం నేత కావూరి జయకుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ జయంతి రోజున ఆయన చెంతకు వెళ్లి దళితులకు క్షమాపణ చెప్పాలన్నారు. లేని పక్షంలో పేదల ఆగ్రహానికి గురికాక తప్పదన్నారు. ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఎస్సీల్లో పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా? అంటూ అవమానించారని గుర్తు చేశారు. ప్రతిపక్షంలో ఉన్నా ఆయన పెత్తందారీ మనస్తత్వంలో ఏ మాత్రం మార్పులేదన్నారు. శింగనమల వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా టిప్పర్ డ్రైవర్‌కు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవకాశం కల్పించారన్నారు. కానీ చంద్రబాబు వేలి ముద్ర గాళ్లు అంటూ అవహేళన చేశారన్నారు. చంద్రబాబు, ఆయన పార్టీ నాయకులకు దళితులు, బహుజనులు, ఎస్సీ సామాజిక వర్గాలంటే చిన్నచూపు అన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు రాజవరపు వెంకటేష్‌బాబు, లేళ్లపూడి లాజర్, గుంతక రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాతి మనుగడలో భాష కీలకం



గ్రంథావిష్కరణ సభలో జంధ్యాల శంకర్, గోళ్ల నారాయణరావు తదితరులు

విజయవాడ కల్చరల్: భాషా సంస్కృతి, సంప్రదాయాల కృషికి సాహిత్య సంస్థలు, ప్రభుత్వాలు కృషి చేయాలని మాజీ మేయర్ జంధ్యాల శంకర్ అన్నారు. రసభారతి సాహితీ సంస్థ, గోళ్ల రాధాకృష్ణమూర్తి, పోలవరపు కోటేశ్వరరావు సాహితీ పీఠం ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం డాక్టర్ జంధ్యాల మహతీశంకర్ రచించిన పద్య మంజరి, డాక్టర్ జంధ్యాల పరదేశిబాబు రచించిన బుద్ధుని బోధనలు- జాతక కథలు, కవి సమ్మేళనం నిర్వహించారు. పద్య మంజరి గ్రంథాన్ని ఆవిష్కరించిన జంధ్యాల శంకర్ మాట్లాడుతూ జాతి మనుగడలో భాష కీలకమైన పాత్ర పోషిస్తుందని తెలిపారు. బహుముఖ ప్రతిభాశాలి సాహితీవేత్త జంధ్యాల మహతీ శంకర్‌గా అభివర్ణించారు. జాతక కథలు గ్రంథాన్ని గోళ్ల నారాయణరావు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ మహనీయుడు గౌతమ బుద్ధుని బోధనలు సర్వదా ఆచరణీయమన్నారు. గ్రంథాలను కవి పండిత పోషకుడు చెట్లపల్లి మారుతీ ప్రసన్నకు అంకితమిచ్చారు. రసభారతి అధ్యక్షుడు పొన్నలూరి లక్ష్మణరావు సభకు అధ్యక్షత వహించారు. డాక్టర్ క్రోవి పార్థసారథి, డాక్టర్ జంధ్యాల జయకృష్ణ బాపూజీ మహతీ శంకర్ సాహిత్య సేవలను వివరించారు. నూతన సంవత్సర ఉగాది సందర్భంగా చలపాక ప్రకాష్, డాక్టర్ వెన్నావల్లభరావు, సర్వాశారద స్వీయ కవితా గానం చేశారు. డాక్టర్ పరదేశిబాబు నిర్వహించారు.

చేతి పంపులకు మరమ్మతులు



చేతిపంపులకు మరమ్మతులు చేస్తున్న కార్పొరేషన్ సిబ్బంది

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): స్థానిక 48, 52వ డివిజన్లలోని పలు ప్రాంతాల్లో మరమ్మతులకు గురైన చేతి పంపులకు కార్పొరేషన్ సిబ్బంది శుక్రవారం మరమ్మతులు చేపట్టారు. ఆయా డివిజన్ల కొండ ప్రాంతాల్లో గత కొంత కాలంగా వినియోగంలో లేని చేతిపంపులను పరిశీలించిన కార్పొరేషన్ సిబ్బంది వాటికి అవసరమైన మరమ్మతులను చేపట్టారు. ఎండల తీవ్రత, కృష్ణానదిలో నీటి మట్టం తగ్గుముఖం పట్టడంతో ప్రజల అవసరాల కోసం నీటిని అందించేలా చేతి పంపులను మరమ్మతులు చేపట్టాలని కార్పొరేటర్లు కోరడం జరిగిందని సిబ్బంది పేర్కొన్నారు. దీంతో ఆయా ప్రాంతాల్లో దెబ్బతిన్న చేతి పంపులకు మరమ్మతులు నిర్వహించడంతో పాటు స్థానికులు ప్రతి రోజు కొంత నీటిని పట్టుకుని వినియోగించాలని సిబ్బంది సూచించారు.

మార్కెట్‌లోకి అధునాతన పల్సర్



సరికొత్త పల్సర్‌ను తొలి కస్టమర్‌కు అందజేస్తున్న వరుణ్ బజాజ్ సీఈఓ సత్యనారాయణ

లబ్బీపేట(విజయవాడతూర్పు): బజాజ్ ఆటో వారి అధునాతన బైక్ పల్సర్ 150 సీసీని శుక్రవారం మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా బెంజిసర్కిల్ వద్ద ఉన్న వరుణ్ బజాజ్ షోరూమ్‌లో ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పీవీ సత్యనారాయణ సరికొత్త బైక్‌ను ఆవిష్కరించి తొలి కస్టమర్‌కు తాళాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త పల్సర్ 4 స్ట్రోక్, ఎయిర్ కూల్డ్, క్లోజ్డ్ లూప్డ్ ఫ్యూయల్ ఇంజక్షన్ సిస్టమ్, 14 హార్స్ పవర్, 13.4 ఎన్ఎం టార్క్ అందించగల, 5 – స్పీడ్ గేర్ బాక్స్ ఉన్నాయన్నారు. కార్యక్రమంలో బజాజ్ ఆటో ఏరియా మేనేజర్ సదత్ బాషా ఇతర సిబ్బంది పాల్గొన్నారు.